వీధి వ్యాపారులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు యూనిస్ అక్బానీ

ఎదులాపురం, మే 28 : వీధి వ్యాపారులకు అధికారులు న్యాయం చేయాలని బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు యూనిస్ అక్బానీ అన్నారు. తొలగించిన చోటనే తమకు వ్యాపారం చేసుకునే వెసులుబాటు కల్పించాలనే డిమాండ్‌తో వీధి వ్యాపారులు ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరవధిక దీక్షలు చేపట్టారు. బుధవారం దీక్షలు 8వ రోజుకు చేరుకోవడంతో బీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్, ఎంబీటీ, భీం ఆర్మీ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. వీధి వ్యాపారులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు సయ్యద్ సాజీదుద్దీన్, షకీల్, జహీర్‌రంజానీ, నజీర్ అహ్మద్, మహ్మద్ రోహిత్ పాల్గొన్నారు.

తెలంగాణ తరపున డాక్టర్ శ్రీధర్ హాజరు

జాతీయ స్టేట్ హోల్డర్ కన్సల్టేషన్‌కు హాజరైన ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మెట్‌పెల్లివార్ శ్రీధర్

ఎదులాపురం,మే 28: నేషనల్ సెంటర్ ఆఫ్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) నేషనల్ ప్రోగ్రాం ఫర్ క్లైమేట్ చేంజ్ అన్ హ్యూమన్ హెల్త్ (ఎన్‌పీసీసీహెచ్) కింద, యూఎన్ఐసీ ఈఎఫ్(యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రెన్స్ ఎమర్జెన్సీ ఫండ్) సహకారంతో ఢిల్లీలో రెండు రోజుల పాటు జాతీయ స్థాయిలో స్టేక్ హోల్డర్ కన్సల్టేషన్ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం తరపున ఆదిలాబాద్ జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మెట్‌పెల్లివార్ శ్రీధర్ వనరుల వ్యక్తిగా హాజరయ్యారు. అంతేకాక నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్.మధువరన్ కూడా పాల్గొన్నారు. భారతదేశంలో వాతావరణ అనుకూలత కోసం ఆవిష్కరణలు, పరస్పర అధ్యయనాన్ని బలోపేతం చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మెట్‌పెల్లివార్ శ్రీధర్ తెలిపారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

ఎదులాపురం, మే 28 : టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ 102వ జయంతిని ఆదిలాబాద్‌లో నిర్వహించారు. ఎన్టీఆర్ చౌక్ లోని ఆయన విగ్రహానికి టీడీపీ ఆదిలాబాద్ నియోజకవర్గ కన్వీనర్ అల్లూరి రాజారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకు ముందుకు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నూనె సతీశ్, గంగసరపు ఓమన్న. నాగన్న, ఆకుల రాము, సోమా గంగారెడ్డి, గంగమ్మ, అంబుబాయి, ప్రశాంత్, రూపమ్మ పాల్గొన్నారు.

బోథ్ గురుకుల ప్రిన్సిపాల్‌కు ఉత్తమ అవార్డు



సీఎం చేతుల మీదుగా బెస్ట్ సర్టిఫికెట్ అందుకుంటున్న బోథ్ గురుకుల ప్రిన్సిపాల్

బోథ్, మే 28: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల(బాలికల) బోథ్ ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలో వందశాతం ఫలితాలు సాధించారు. ఇందుకుగాను బుధవారం హైదరాబాద్‌లోని జగ్జీవన్ రామ్ భవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రిన్సిపాల్ జీ సంగీత బెస్ట్ సర్టిఫికెట్, అవార్డు అందుకున్నారు. పాఠశాల అభివృద్ధి కోసం రూ.5 లక్షల చెక్కును అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

లాండె దత్తు కుటుంబాన్ని ఆదుకోవాలి

- మాజీమంత్రి జోగు రామన్న



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, మే 28 : పాదచారులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న తర్నం వంతెనను కొట్టివేయడంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు అత్యుత్సాహంప్రదర్శించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మండిపడ్డారు.తర్నం వంతెన నిర్మాణ పనుల్లో తలెత్తిన తీవ్ర జాప్యం ప్రాణనష్టం దాకా దారి తీసిందని, ఈ నిర్లక్ష్యానికి ప్రజాప్రతినిధులే బాధ్యత వహించాలని ధ్వజమెత్తారు. తాజాగా వంతెన నిర్మాణానికి సంబంధించి అసంపూర్తి పనులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా లక్ష్మీపూర్‌కు చెందిన రైతు లాండె దత్తు కొట్టుకుపోయి మరణించాడని తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలపై ఉందన్నారు. రూ.25 లక్షల ఆర్థిక సహాయాన్ని తక్షణం ప్రకటించాలని డిమాండ్ చేశారు. బుధవారం కార్యకర్తలతో కలిసి జైనథ్ మండలంలోని తర్నం బ్రిడ్జిను సందర్శించారు. జోగు రామన్న అక్కడి పరిస్థితిని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్నారు. ద్విచక్రవాహనాలు, పాదచారులకు ప్రయోజనకరంగా ఉన్న వంతెనను పూర్తిగా కూల్చివేయడం బాధాకరమన్నారు. పనులు పూర్తికాక ముందే వంతెనను తొలగించడం వెనుక ఏ అవసరం ఉన్నదని జోగు రామన్న ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.40 కోట్లతో ప్రత్యామ్నాయ రోడ్డును ఏర్పాటు చేయడంతో పాటు తాత్కాలిక వంతెనను మరమ్మతులు చేసి అందుబాటులోకి తెచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కమీషన్ల కోసం ప్రజా అవసరాలను విస్మరిస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, కాంగ్రెస్ మంత్రులకు ప్రజా సమస్యలపై సరైన అవగాహన లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, కల్చప్‌రెడ్డి, సంతోష్, బట్టు సతీశ్, తిరుపతి, విఠల్, మహేశ్ పాల్గొన్నారు.

బ్రిడ్జి కూల్చివేతపై విచారణ జరిపించాలి

ఎదులాపురం, మే 28 : లాండె దత్తు మృతికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని మాజీమంత్రి జోగు రామన్న కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలతో తర్నం బ్రిడ్జి వద్ద వాగు పొంగిపొర్లుతున్న సదరు కాంట్రాక్టు సిబ్బందితో పాటు ప్రభుత్వ యంత్రాంగం బ్రిడ్జి వద్ద ఎలాంటి హెచ్చరికలు జారీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి, లాండె దత్తు మృతికి కారకులయ్యారని జోగు రామన్న అన్నారు. అతని కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని రూ.25 లక్షల ఆర్థిక సహాయంతోపాటు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. బ్రిడ్జి కూల్చివేతపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి బాధ్యులపై చర్యలు చేపడతామన్నారు. ఇక్కడ యూనిస్ అక్బానీ, ఇజ్జగిరి నారాయణ్ణ, గోవర్ధన్, సాజిదుద్దీన్, బట్టు సతీశ్ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు వినియోగించుకోవాలి

అభ్యర్థులతో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి కే మిల్క

ఎదులాపురం, మే 28 : జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కే మిల్క సూచించారు. బుధవారం ఆదిలాబాద్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో పేటీఎంలో సెల్స్ ఎగ్జిక్యూటివ్ కోసం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు హాజరుకాగా పేటీఎం ప్రతినిధులు ఉద్యోగ వివరాలు, ఫీల్డ్ వర్క్, తదితర అంశాలపై స్పష్టత ఇచ్చారు. పదో తరగతి, ఇంటర్ అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పేటీఎం ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది గోవర్ధన్ పాల్గొన్నారు.

తక్కువ మోతాదులో ఎరువులు వాడాలి

తాంసి, మే 28: రసాయన ఎరువులు తక్కువ మోతాదులో వాడి ఖర్చులు తగ్గించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాంప్రసాద్, ప్రవీణ్ కుమార్ సూచించారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని పాలోడి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పంట మార్పిడి పద్ధతి పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందాలని అన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, ఏవో రవీందర్, ఏఈవో శివ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

దవాఖానను తనిఖీ చేసిన డీఐవో

సారంగాపూర్, మే 28: నిర్మల్ జిల్లా సారంగాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా టీకాల అధికారి డాక్టర్ నయనారెడ్డి తనిఖీ చేశారు. వ్యాక్సిన్లు నిల్వ చేసిన రిఫ్రిజిరేటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులకు ఇచ్చే వ్యాక్సిన్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఫార్మసీ ఆఫీసర్ సంతోష్‌కు సూచించారు. అంతకు ముందు చించోలి(బీ), ధని ఆరోగ్య ఉపకేంద్రాల్లో వ్యాక్సినేషన్ తీరును పరిశీలించారు. ఆమె వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ జవాద్, పర్యవేక్షకులు కృష్ణమోహన్ గౌడ్, ప్రేమ్‌సింగ్ ఉన్నారు.

ఆర్థిక సాయం

సోన్, మే 28: నిర్మల్ జిల్లా సోన్‌కు చెందిన ప్రేమ్‌సాగర్ దుబాయిలో పాకిస్థానీ చేతిలో హత్యకు గురి కావడంతో ఆ కుటుంబానికి జై జవాన్ సేవ సమితి ఆధ్వర్యంలో రూ. 10వేలు అందజేశారు. ఇక్కడ జై జవాన్ సేవ సమితి అధ్యక్షుడు మల్లేశ్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి దిలీప్, సెక్రటరీ ప్రవీణ్, నాయకులు డాక్టర్ నరేశ్, తదితరులు ఉన్నారు.

రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు

ఎదులాపురం, మే 28 : యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2న మంజూరు పత్రాలు (ప్రొసీడింగ్స్) అందజేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్ యువ వికాసం పథకంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ జూన్‌లో రూ.50 వేలు, రూ.లక్ష లోపు సబ్సిడీ రుణ కేటగిరీల్లోని సుమారు 85వేల మంది లబ్ధిదారులకు మొదటగా మంజూరు చేస్తామని తెలిపారు. అన్ని జిల్లాల్లో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మంజూరు పత్రాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు సూచించారు. మంజూరు చేసిన యూనిట్ల స్థాపన అనంతరం వాటి పనితీరు, నిర్వహణ తీరుతెన్నులను పర్యవేక్షించేందుకు జిల్లాలో మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే ఇన్‌చార్జి మంత్రుల సమావేశాల్లో రాజీవ్ యువ వికాసంపై చర్చించి తుది జాబితా ఆమోదం చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షి అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, సీఈవో జితేందర్, మనోహర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

By This Deed I,The under Signed MAJID CHOTI MIYA S/o CHOTI MIYA R/o. H.No. 3-5-104/105/1,Choudari galli Bhainsa (Vill), R/M Bhainsa Dist,Nirmal.504103 Telangana. I Changed My Name From MAJID S/o CHOTI MIYA to **MAJID CHOTI MIYA S/o CHOTI MIYA** For all Future Pupose.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, తిరుపతి: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677

అకాల వర్షం .. పంటలకు నష్టం

కుంటాల: ఓలా శివారులో నేల వాలిన వరి పంట

బేల: తడిసిన నువ్వు పంటను చూపిస్తున్న రైతు అర్పణ

కుంటాల, మే, 28 : ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులకు నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని ఓలా శివారులో రైతులు గజానంద్, సాయిల నర్సయ్యకు చెందిన 4 నుంచి 5 ఎకరాల వరి నేల వాలిపోయింది. కోతకువచ్చిన పంట ఇలా వర్షానికి దెబ్బతినడంతో రూ. 2 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

తడిసిన నువ్వు పంట

బేల, మే 28: మంగళవారం కురిసిన వర్షానికి ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని అపోలో సిర్సన్న గ్రామానికి చెందిన రైతు గేడం అర్పణకు తీవ్ర నష్టం మిగిల్చింది. రెండు ఎకరాల్లో యాసంగి కింద సాగు చేసిన నువ్వు పంట వర్షానికి తడిసి నష్టం వాటిల్లింది. సాగు కోసం రూ.30 వేలు ఖర్చు చేసిన, చివరికి ఒక్క రూపాయి కూడా రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. పంట నష్టం అంచనా వేసి పరిహారం అందించాలని అధికారులను రైతు వేడుకుంటుంది.

సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నిర్మల్ అర్బన్, మే 28: మామడ లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2003-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ఎదులాపురం, మే 28 : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ఉత్తమ బోధన పద్ధతులను అవలంబించాల్సి అవసరం ఉందని రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ బోచ్కర్ ఓం ప్రకాశ్ అష్టావధాని తెలిపారు. బుధవారం ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రిజర్వ్ పోలీస్ లైన్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల వృత్యంతర శిక్షణలో భాగంగా, తెలుగు భాష ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్యం తెలుగు భాషకు ఉచ్వాస నిశ్వాసలు వంటివి అని తెలిపారు. బోధన ప్రమాణాల మెరుగుకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేసి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ ప్రధానోపాధ్యాయురాలు నీలాదేవి, అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీకాంత్ గౌడ్, జిల్లా స్థాయి విషయ నిపుణులు చిలుక పొచ్చన్న, టీ చరణ్‌దాస్, మంద భూమేశ్, ఎండీ ఖలీముద్దీన్, కవి సామల రాజ్యవర్ధన్, కవి తొడిశెట్టి రాములు, కవి చిందం ఆశన్న, వివిధ మండలాల తెలుగు పండితులు పాల్గొన్నారు.

తర్నం సొత్నాల వాగులో కొట్టుకుపోయిన యువకుడు

జైనథ్, మే 28: జైనథ్ మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సొత్నాల వాగు ఉప్పొంగి ప్రహించింది. మంగళవారం రాత్రి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన లాండె దత్తు(30) ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్ నుంచి తన స్వగ్రామానికి వస్తుండగా తర్నం వద్ద లోలెవల్ బ్రిడ్జిపై వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. ఈ విషయం తెలుసున్న ఎస్ఐ గౌతం ఆధ్వర్యంలో పోలీసులు గజా ఈతగాళ్ల సహాయంతో మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం వరకు మృతదేహం కనిపించకపోయిందని ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

ఇద్దరు బాలురు అదృశ్యం

ఎదులాపురం, మే 28: గాంధీ పార్క్‌కు వెళ్తున్నామని చెప్పి వెళ్లిన ఇద్దరు బాలురు అదృశ్యమైనట్లు మావల సీఐ కే స్వామి తెలిపారు. కేఆర్‌కే కాలనీకి చెందిన సరళ పెదమ్మ కుమారుడు సరళ నాగరాజు(13), ఆమె బావ కుమారుడు సరళ చరణ్ మంగళవారం గాంధీ పార్కు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరారు. ఆరోజు సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. దీంతో ఆమె బంధువుల ఇండ్లలో వెతికిన ఆచూకీ కనిపించలేదు. బుధవారం మామల పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

బోథ్, మే 28: ఆదిలాబాద్ జిల్లా సొనాల మండలం పార్డి(కే) గ్రామంలోని పలువురి ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్నారన్న సమాచారంతో బుధవారం బోథ్ సీఐ వెంకటేశ్వరరావ్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తనిఖీలు నిర్వహించి గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోలంకి గులాబ్ సింగ్ ఇంటి ఆవరణలో ఐదు మొక్కలు, రామ్‌సింగ్ హాన్ ఇంటి ఆవరణలో మరో మూడు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

ఇచ్చోడ(సిరికొండ), మే 28: ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని కొండాపూర్ శివారులో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి విద్యుత్ తీగ కింద పడింది. బుధవారం మేతకు వెళ్లిన ఆవు విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందింది. ఆవు విలువ రూ.80 వేలు ఉంటుందని బాధిత ఎర్రన్న తెలిపాడు. సంబంధిత శాఖాధికారులు స్పందించి తనకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బోథ్, మే 28: ఆదిలాబాద్ జిల్లా సొనాల మండలంలోని గుట్టపక్కతండా వద్ద రెండు రోజుల క్రితం ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో గుర్రలతండాకు చెందిన సురేందర్ (30) ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సురేందర్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

బోథ్, మే 28 : పురుగుల మందు వ్యక్తి ఆత్మహత్య చేసున్న ఘటన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బాబెర గ్రామానికి చెందిన ఆత్రం దశరథ్(49) రెండు సంవత్సరాల నుండి లివర్, కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ప్రతి రోజూ మద్యం తాగేవాడు. బుధవారం కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లగా ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన కుటుంబీకులు గమనించి అంబులెన్స్‌లో బోథ్ సీహెచ్‌సీకి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

భైంసా, మే 28: భైంసాలోని సిద్దార్థ నగర్‌కు చెందిన వాగ్మారే శెట్టిబా (78) అనారోగ్య సమస్యలతో బుధవారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భైంసాటౌన్,మే 28: సీజనల్ వ్యాధులపై ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో కోమల్ రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా భైంసాలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన ఆవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. వ్యాధులు బారిన పడితే నిపుణులచే వైద్య చికిత్సలు తీసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, వైద్యులు ఆనంద్, పశువైద్యాధికారి విఠల్ పాల్గొన్నారు.

కుంటాల, మే, 28 : వర్షాకాలం ముందస్తుగా రావడంతో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీపీవో శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. పారిశుధ్యంపై దృష్టి సారించాలని అన్నారు. కుంటాల రైతు వేదికలో ధాన్యం కొనుగోలు, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు, ఫర్టిలైజర్స్ లభ్యత, ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీవో లింబాద్రి, ఎంఏవో విక్రమ్, ఎంపీవో రహీం, ఏపీఎం అశోక్, ఏపీవో నవీన్, కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఓల గ్రామంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.

వేణునగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే

ఉట్నూర్ రూరల్, మే 28: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఉట్నూర్ మండలంలోని వేణునగర్ గ్రామంలో పర్యటించారు. స్థానికులని కలిసి వివరాలు తెలుసుకున్నారు. వరద నిలువకుండా నేరుగా వెళ్లే విధంగా అడ్డుగా ఉన్న కట్టడాలను తొలగించాలని డిప్యూటీ తహసీల్దార్ అమృత్‌లాల్‌ను ఆదేశించారు. ఆయన వెంట నాయకులు, ప్రజలు ఉన్నారు.

క్షయ నిర్మూలనకు చర్యలు

భీంపూర్, మే 28 : క్షయ నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని డీటీసీవో డాక్టర్ సుమలత అన్నారు. నిపాని ఉపకేంద్రం ఆవరణలో తాంసి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్షయ పరీక్షల శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో తాంసి వైద్యాధికారిణి శ్రావ్యవాణి, సిబ్బంది , ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఆటంకం

మంగళవారం పోలీసులు తొలగించిన వాహనాలతో ఖాళీగా ఉన్న ప్రధాన రోడ్డు

ఇచ్చోడ, మే 28: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని ప్రధాన రహదారిపై వాహనదారులు, చిరువ్యాపారులు రోడ్డుకు ఇరువైపులా, మధ్యలో వాహనాలు నిలిపివేయడంతో పాటు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మంగళవారం జరిగిన ఇటువంటి పరిస్థితిపై పోలీసులకు ఫిర్యాదులు రావడంతో ఎస్ఐ సంజయ్ నేతృత్వంలో పోలీసులు చర్యలు తీసుకొని అక్రమంగా నిలిపిన వాహనాలు, దుకాణాలను తొలగించారు. అయితే బుధవారం మళ్లీ ఇదే స్థితి పునరావృతమైంది. తిరిగి వాహనదారుల, చిరు వ్యాపారులు రోడ్డుపైకి వచ్చి దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారం తీసుకురావాలని స్థానికులు ప్రభుత్వాన్ని, పోలీసులను కోరుతున్నారు.

బుధవారం ప్రధాన రోడ్డుపై నిలిపిన వాహనాలు

నర్సరీల్లో మొక్కలు సంరక్షించాలి

ఇచ్చోడ, మే 28: రానున్న వర్షాకాలానికి నాటేందుకు నర్సరీల్లో మొక్కలు సంరక్షించాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఎఫ్ఏ, టీఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నర్సరీలో వెయ్యి ఖర్జూర, బొప్పాయి, మామిడి, మునుగ, కరివేపాకు మొక్కలు పెంచాలన్నారు. గ్రామాల్లో కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో నరేందర్, ఎఫ్ఏలు, టీఏలు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రైతు భరో